''బేబీ!' అన్న పిలుపు వినపడగానే చెంగున వరండాలోకి పరుగెత్తింది చంద్రప్రియ. పన్నెండేళ్ళుంటాయి. తెల్లటి పరికిణీ, లంగాలో బొద్దుగా ఉండి, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత చక్కగా ఉంది. నుదుట ఎర్రని తిలకం, మెడలో సన్నని ఒంటిపేట బంగారు గొలుసు, చెవులకు బుట్ట లోలకులు ఆ పాప అందానికి మరింత మెరుగులు దిద్దుతున్నాయి.

తండ్రిని చూడగానే నవ్వి సైకిల్ అందుకుంది.

నవ్వినప్పుడు బుగ్గలపై చిన్న సొట్టలు మెరిసి మాయమయ్యాయి.

''జాగ్రత్తమ్మా—పడతావేమో? వద్దంటే వినవు కదా?'' కూతురు సైకిలు లాక్కోవడంతో రామారావు చిన్నగా విసుక్కున్నాడు.

అదేమీ గమనించనట్టే సమాధానమైనా చెప్ప కుండానే చంద్రప్రియ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం లోకి సైకిలు తోసుకుంటూ పోయింది, నేర్చు కుందుకు.

ఈలోగా రాజేశ్వరి లోపలినుండి బయటికి వచ్చింది చిరునవ్వుతో.

''రాను రాను ఇది మరీ పెంకెఘటమైపో తూందండీ. చెబితే వినదు, మాటంటే లెక్క లేదు'' అంటూ భర్త చేతిలోని ఖాళీ కారియర్ సంచీ అందుకుని లోనికి నడిచింది, దూరంగా సైకిలు నేర్చుకుంటూన్న కూతురివంకే చూస్తూ.

రాజేశ్వరి ననుసరించాడు రామారావ్—''పోనీలే ఆడుకోనియ్'' అంటూ.

వారి దొక మధ్య తరగతి సంసారం. ముచ్చటగా ఇద్దరే ఇద్దరు పిల్లలు. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. కుటుంబ నియంత్రణ పాటించడంవల్ల పిల్లలిద్దరి మధ్యా నాలుగేళ్ళ ఎడముంది. పిల్లలంటే ప్రాణం వాళ్ళిద్దరికీ. చాలా గారాబంగా పెంచారు. ఈనాటివరకూ నయాన్నో, భయాన్నో చెప్పడమే కాని, వాళ్ళ ఒంటిమీద చెయ్యివేసి ఎరుగరు. సాధ్యమైనంతవరకూ పిల్లల కే లోపమూ రానిచ్చే వారు కాదు. వాళ్ళు కోరుకున్నవి తాము సర్దుకునైనా సమకూర్చి సంతోషపెట్టేవారు.

అయితే గారాబం చెయ్యడంలో చంద్రప్రియను కొంచెం మోతాదు మించి చేశారనే చెప్పాలి. దానికి కారణం— ఆ అమ్మాయి పుట్టాక రామారావుకు కలిసి వచ్చిందన్న నమ్మకమే. అతి గారాబంవల్ల చంద్రప్రియ ఏది చెప్పబోయినా వినదు. తన పంతం నెగ్గించుకునేందుకు ఎంత గొడవైనా చేస్తుంది. సినిమా అంటే సినిమా. రిబ్బనంటే రిబ్బను. పూలజడంటే పూలజడ. ఫొటో అంటే ఫొటో. వెంటనే తీర్చకపోతే ఆ అమ్మాయి పట్టు వదిలించడం బ్రహ్మదేవుడి తరం కాదు. లేకపోతే—''నేనంటే మీ కిష్టం లేదు'' అనో, ''కుక్కకు పడేసినట్టు ఇంత కూడు పడేసి పెంచుతున్నా''రనో మునగ దీసుకుపోయి ఏడుస్తూ కూర్చుంటుంది. రోజుల తరబడి ఎవ్వరితోనూ మాట్లాడదు.

ఒకరోజు అలాగే సాయంత్రం అందరూ కూర్చుని మాట్లాడుకుంటుండగా మాటల మధ్య 'బేబీ!' అన్నాడు నవ్వి ''రేపు నీ పుట్టిన రోజు, బేబీ'' అంది రాజేశ్వరి యథాలాపంగా.

పుట్టినరోజు పండుగలు చేసే అలవాటు లేదు ఆ ఇంట్లో ఎందుచేతనో.

అయినప్పటికీ రాజేశ్వరి మాటల ఫలితం— ఆ నెలాఖరు రోజుల్లో అప్పుచేసి తెల్లవారేసరికల్లా పట్టు లంగా కుట్టించవలసి వచ్చింది రామారావు— కూతురి ఏడుపు మానిపించేందుకు.

అదే రామారావు తన జీవితంలో చేయి చాచి అప్పుచేయడం తొలిసారిగా.

అందుకనే ఆ అమ్మాయిని ఏమనడానికీ భయపడతారు ఆ ఇంట్లో అందరూ, ఏమంటే ఏమవుతుందోనని. అయితే మురళిని కూడా అంత గారం చేసినా ఇలాక్కాదు. అర్థం చేసుకోగలడు.

''నానిగాడు ఇంకా రాలేదా?'' పంటు, షర్టు విడిచి లుంగీకట్టుకుంటూ అడిగాడు రామారావు, కొడుకు మురళీ గురించి.

మురళికి రోజూ సాయంత్రం అలా షికారుకు వెళ్ళడం అలవాటు. ఫ్రెండ్స్‌తో కలిసి అలా అలా తిరిగి చీకటిపడే వేళకు ఇంటికి చేరుకుంటాడు.

''ఊహు. వచ్చాడు. ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళతానంటే పంపించాను.'' కాఫీ అందిస్తూ చెప్పింది రాజేశ్వరి, భర్తకు సమాధానంగా.

## గోపీ కృష్ణ

రామారావు కలవరపడ్డాడు.

''అరే! ఫస్టు షో కెందుకు పంపావ్? అంతగా కావాలంటే మాటినీకి పొమ్మనకపోయావా? చీకట్లో పదింటికి ఒక్కడే ఎలా వస్తాడు, రాజీ? పంపకుండా ఉండవలసింది.''

''ఏం చెయ్యమంటారు? ఫ్రెండ్సందర్నీ వేసుకు వచ్చాడు. వాళ్ళందరిముందూ వద్దని ఎలా అనను?'' నెమ్మదిగా వివరించసాగింది రాజేశ్వరి.

''అదికాదు! రాజీ. రోజులేం బాగుండలేదు కదాని అన్నాను.''

రామారావు కలవరపడుతూనే ఉన్నాడు.

రాజేశ్వరికిభర్త ధోరణికి నవ్వొచ్చింది. ''ఏమిటండీ మీరు మరీనూ! పదహారేళ్ళొచ్చాయి వాడికి. చీకట్లో ఇంటికే రాలేడా?'' హాస్యంగా అంది భర్త ఎదురుగా కుర్చీలో కూర్చుంటూ.

రామారావూ కొంత బిగువు తగ్గించుకుని ఫ్రీగా నవ్వాడు. నెమ్మదిగా కాఫీ తాగసాగాడు.

''అయినా ఇక ముందెప్పుడూ అలా పంపకు'' అని మెత్తగానే అల్టిమేటమ్ జారీ చేశాడు. అతని వెర్రి అతనిది. రద్దీగా ఉండే రోడ్లూ, చీకట్లో స్పీడుగా దూసుకుపోయే లారీలూ అతని భయం.

''ఎప్పుడొస్తాయట రిజల్ట్సు?'' అడిగాడు.

మురళి ఇంటర్మీడియేట్ పరీక్షలు వ్రాశాడు.

''ఏమో?'' రాజేశ్వరి.

ఏదో మాట్లాడుకుంటూ కూర్చున్నారు... వంటింట్లో గిన్నెలు కదిలిన చప్పుడైంది. వెంటనే రాజేశ్వరి లేచి అదిలిస్తూ పరుగెత్తింది లోనకు. వంట గదంతా సర్ది తిరిగి వచ్చి కూర్చుంటూ అంది: ''పాడు ఎలుకలు చంపుకు తినేస్తున్నాయి. అసలు కదల నివ్వవు, మెదల నివ్వవు. ఏమండీ! కాస్త మీ ఎగ్రికల్చరల్ డిపార్టుమెంటు ఫ్రెండును అడిగి ఎలుకల మందు సంపాదించకూడదూ? అదయితే బాగా పని స్తుందట''.

''సరే. రేపెప్పుడైనా ఆ టెల్ఫిసప్పు డడుగు తాన్లే.''

ఇంతలో ఏడుపు ముఖం పెట్టుకుని వచ్చింది చంద్రప్రియ. మోచేతులూ, మోకాళ్ళూ కొట్టుకుని పోయి రక్తం కారుతున్నాయి.

''హమ్మో!'' అంటూ లేచారు రాజేశ్వరీ, రామారావు. ఇద్దరి ముఖాల్లోనూ ఆందోళన.

''గొప్పు ఎక్కేస్తూంటే పడిపోయా.'' సిగ్గుగా చెబుతూంది చంద్రప్రియ.

కాఫీగ్లాసు పక్కను పడేశాడు రామారావు.

''అరె! వద్దంటే వినవు కదా, బేబీ? ఆడపిల్లవు నీకు సైకిలేమిటమ్మా? ఛ ఛ! ఇప్పుడు చూడు అనవసరంగా చేతులూ, కాళ్ళూ దెబ్బలేనా?'' అంత కంగారులోనూ ప్రేమగానే అనునయించాడు.

రాజేశ్వరి తడి గుడ్డ తెచ్చింది.

గాయాలకు అంటుకున్న దుమ్మంతా తుడిచి మందు తెచ్చి రాశాడు రామారావు. లాలనగా ఒళ్ళో కూర్చో పెట్టుకుని ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పసాగాడు కూతురుకి. ఏ పనులు చెయ్యాలో, ఏవి చెయ్యకూడదో నెమ్మదిగా వివరిస్తున్నాడు. కాసేపు బాగానే వింది. ఇంతలోనే—''పూ. ఇవన్నీ నాకు తెలవ దేమిటి?'' అంటూ విసురుగా లేచిపోయింది.

'పిచ్చిపిల్ల! ప్రేమగా అనుకున్నాడు రామారావు.

* * *

ఇన్స్‌పెక్షన్ ఉందని తెలియరావడంతో ఆ రోజు ఆఫీసులో పెండింగ్ పని పూర్తి చేయడంలో సీరియస్‌గా మునిగి పోయి ఉన్నాడు. రామారావ్.

పిడుగులా ఒక వార్త తెలిసింది.

ఇంటర్మీడియెట్ రిజల్ట్సు వచ్చాయనీ, ఏవో అవకతవకల వల్ల చాలామంది తప్పారనీ, అప్పుడే ఎవరో కుర్రవాడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడనీను.

అంతే. గుండె ఆగినంత పనయింది రామారావుకు. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. భయంతో వేళ్ళు వణుకుతూ పెన్నుకూడా పుచ్చుకోలేక పోతున్నాడు.


---

## గుండె గంట

### సారె సారెకు

నీ గుడిలోని
గంట మ్రోగించి
నిను విసిగించను.
కాని అనుక్షణం
నా గుండెలో ధ్వనించే
నీ నామస్మరణ
వింటానని మా టివ్వవా స్వామి!

-గోవిందరాజు రామకృష్ణరావు



# అనుకున్నవి జరగవు– అనుకోనివి ఆగవు

'వానిగాడు?'

ఇంటర్ రిజల్ట్సు వస్తే వానిగాడు ఏమయి నట్టు? అసలు ఫస్టు క్లాసు గారంటీ అంటున్నాడు అలాంటి వాడు ఇంతవరకూ తనకు వచ్చి చెప్పకుండా ఉంటాడా?

చిన్నప్పటినుంచీ ఏ తరగతి పాసయినా వెంటనే అఘమేఘాలమీద ఆఫీసుకు వచ్చి తనకు చెప్పి కాని వాడి ఇంటి దగ్గర తల్లి కయినా చెప్పడు. మరి మధ్యాహ్నం రెండింటికే సప్లిమెంటరీ వచ్చిందంటు న్నారు. ఇప్పుడు నాలుగవుతున్నా ఇంకా వచ్చి చెప్ప లేదంటే?

ఒక వేళ ఆ రైలు కింద పడిన వాడు—

ఉలిక్కి పడ్డాడు రామారావు తన ఆలోచనలకు. కళ్ళు మూసుకుని భగవంతుని తలుచుకున్నాడు ఏ ఆపదా రాకుండా కాపాడమని. అయినా గుండె దడ పెరుగుతూనే ఉంది. తగ్గడం లేదు. ఒళ్ళంతా జ్వరం వచ్చినట్టు మారిపోయింది ఆ కాస్సేపటికే. నోరు చేదుగా ఉంది.

లేచి టాయిలెట్ కు వెళ్ళి వచ్చాడు.

కాలు గాలిన పిల్లిలా ఉంది పరిస్థితి. ఇక ఉండబట్ట లేక ఆఫీసరు నడిగి పెర్మిషను తీసుకుని సైకి లెక్కి ఇంటికి బయలుదేరాడు.

దారి పొడవునా ఒకటే ఆలోచనలు. 'భగవంతుడా! వానిగాణ్ణి కాపాడు' అని ఎన్ని సార్లు మొక్కు కున్నాడో లెక్కలేదు.

ఇంటికి చేరాలంటే లెవెల్ క్రాసింగ్ దాటాలి. కాని, పట్టాలు చేరుతున్న కొద్దీ రామారావుకు నెత్తిని ఏదో ఒక టన్ను బరువు మోస్తున్నట్టుగా భారంగా ఉంది. చెవులు గసలు పోస్తున్నాయి. ఒంటి నిండా చెమటలు. షర్టు వీపుకి అతుక్కుపోయింది. కళ్ళల్లోకి చెమటలు జారి కళ్ళలో మంట. అరచేతుల నిండాకూడా చెమటలు పట్టి సైకిల్ హేండిల్ పట్టుకోవడం కష్టంగా ఉంది.

రైల్వే గేటు దగ్గరికి వచ్చేస్తూంది.

జనం ఓవర్ బ్రిడ్జి వేపు పరుగెడుతున్నారు. అందరినోటా ఒకే మాట—ఎవరో రైలు కింద పడ్డారని.

ఆ క్షణాన రామారావుకు తా నక్కడే చచ్చిపోతే బాగుండు ననిపించింది. ఒకవేళ రైలు క్రింద పడింది వానిగాడే అయితే తా నా [illegible] భరించ లేడు, భరించి బ్రతకలేడు.

తాను చేయగలిగిందేమీ లేనట్టు రైలుగేటు వచ్చేసింది. రోడ్డు కొంచెం ఎత్తుగా మారింది. ఆ కాస్త ఎత్తే తొక్కలేక ఓపికలేక సైకిల్ దిగి పోయాడు రామారావ్. దూరంగా ఉన్న ఓవర్ బ్రిడ్జివైపు చూడకూడదనుకుంటున్నా చూడ కుండా ఉండలేకపోయాడు. ఒకచోట జనం పెద్ద గుంపుగా పోగయి ఉన్నారు. [illegible]

చాలామంది గబగబా పరుగెత్తుకుని అక్కడికి వెళుతూంటే కొంతమంది దిగాలుగా తిరిగి వస్తున్నారు.

అందరి ముఖాల్లోనూ విషాదమే.

ఏం చెయ్యాలో తోచడం లేదు రామారావుకు. ఇక తప్పదన్నట్టు తిరిగి వస్తున్నవాళ్ళలో ఒక తెలిసిన ముఖాన్ని "ఎవరు?" అని అడిగేశాడు. "పడిందెవరు?" అనడిగే ధైర్యం కూడా లేదు.

వాళ్ళు నోరు తెరిచారు.

ఆ క్షణం రామారావు మనస్సు రెండవ ప్రపంచ యుద్ధంలో ప్రేలడానికి సిద్ధంగా ఉన్న మొదటి ఆటంబాంబులా ఉంది.

ఏం వినవలసి వస్తుంది?

మెడమీద నరాలన్నీ ఉద్వేగంగా పొంగాయి.

ముఖంలోకి వేడి రక్తం చిమ్మింది.

రెండు చేతులతో హేండిల్‌పై బిగుసుకుని ఒరుసుకుపోతున్నాయి. వాళ్ళేదో చెప్తున్నారు— 'ఆ—భూపతిరావు గారబ్బాయండీ. ఒక్కడే కొడుకు. ఎంత డబ్బున్న వాడయినా ఏంచేస్తాడు పాపం! ఇప్పుడు? రైలు కట్టమీద పడి పొరులి ఏడుస్తున్నాడు, కొడుకును చూసుకుని.''

రామారావుకు వినిపించిం దొక్కటే?

ఎవరో "భూపతి రావుగారబ్బా" యన్నమాట. తతిమ్మా దేమీ వినపడలేదు. పెద్ద రిలీఫ్.

"ఏమిటి? నిజమే? భూపతిరావు గారబ్బాయా?" ఆత్రంగా ప్రశ్నించ సాగాడు. నిజానికి ఆ భూపతి రావు ఎవరో తనకు తెలియదు కాని, అది తన కొడుకు కాదన్న నిజం అందులో దాగుంది. ఏదో ఆరాటం. అది తన కొడుకు కాదన్న నిజం మళ్ళీ వినాలనే ఆత్రత.

"అవునండీ. 'నా చావు కెవరూ కారణం కాదు, జీవితంపై విరక్తితో నేనే చచ్చిపోతున్నాను' అని ఉత్తరం వ్రాసి జేబులో పెట్టుకున్నాడండీ. పోలీసు వాళ్ళు వచ్చారు మరి."

"అయ్యో పాపం!" అప్పటికి కాని ఆ ఆగంతుకునిమీద సానుభూతి చూపించ లేక పోయాడు. మళ్ళీ ఒకసారి దూరంగా గుంపు వైపు చూసి సైకిలు ఎక్కాడు. రైలు క్రింద పడింది తన కొడుకు కాదని తెలుసుకున్నాక వాడి రిజల్టు మీద ధ్యాస మళ్ళింది.

పాసయితే వెంటనే వచ్చి చెప్పాలే ఆఫీసులో.?

ఎందుకు రాలేదబ్బా?

మురళీ ఎప్పుడూ, ఇంతవరకూ అన్నీ ఫస్టు క్లాసులోనే పాసవుతూ వచ్చాడు. ఈసారీ అంత గట్టిగానే ఫస్టుక్లాసు వస్తుందని చెప్పాడు. అందరికీ వాడిమీద నమ్మకమే.

అయితే పరీక్షలు మొదలు పెట్టినవాటినుండీ ఈసారి ఇంటర్మీడియెట్ బోర్డు అవకతవకలతో మరొక ప్రపంచ వింతగా మారింది.

విద్యార్థుల జీవితాలతో ఈ చెలగాటాలేమిటో అర్థం కాదు. దేశంలో ఇన్ని లక్షల మంది నిరుద్యోగులు ఉండగా సరిగా పనిచేయని ఆ కంప్యూటర్లెందుకో? వాటిమీద వెచ్చించే లక్షల రూపాయలు ఈ నిరుద్యోగులకు నామమాత్రపు జీతాలుగా ఇచ్చినా ఆ నాలుగు రోజులూ గొడ్డుల్లా పని చేస్తారే!

అబ్బే! అలాగయితే ఎలా? దేశం అభివృద్ధి చెందిందనడానికి నిదర్శనంగా కంప్యూటర్లు వాడ వలసిందే.

ఇల్లు చేరుతూనే వరండాలో సైకిలు స్టాండు వేసి గబగబా లోనికి నడిచాడు—"రేయ్, నానీ!" అని పిలుస్తూ రామారావు.

మూల కూర్చుని మోకాళ్ళమీద తల దించుకుని ఏడుస్తూ కనిపించాడు వాడు.

పరీక్ష పోయిందన్నమాట!

రామారావుకు బాధగా అనిపించింది. ఇప్పటి వరకూ ఒకరకం బాధ. ఇప్పటినుంచి మరొక రకం బాధలు. వాడెలా చదువుతాడో తనకు తెలుసు. వాడి పరీక్ష పోవడమేమిటి?

అదే అనేంతలో రాజేశ్వరి దిగాలుగా లోపలి నుండి వచ్చింది భర్త గొంతు విని. పీక్కుపోయిన ముఖంతో జుట్టంతా చెదిరి వారం రోజులనుండీ లంఖణాలు చేసినట్టుగా ఉంది.

"థర్డ్ క్లాసు వచ్చిందటండీ" అంది.

రామారావుకు ఆశ్చర్యం వేసింది. అంటే వీడు ఫెయిల్ కాలేదు! మరెందుకంత ఏడుపు? ఎలాగూ బోర్డంతా అవకతవకలు జరిగా యంటున్నారుగా? అంత బాధపడవలసిన అవసర మేముంది? ఏడుస్తున్న మురళీ దగ్గరగా వెళ్ళాడు.

తలపై నిమురుతూ, "రేయ్, నానీ! ఛ! ఏడవకు. లే. ఎందుకు ఏడుపు? పాసయ్యావుగా?" అన్నాడు.

"ఇందాకటినుంచీ ఎంత చెప్పినా వినడం లేదు. రెండింటినుంచీ ఇదేవరస." భర్త వెనక చేరి అంది రాజేశ్వరి కూడా. ఆమె కిప్పుడు కాస్త ధైర్యంగా ఉంది.

చివ్వున తల పైకెత్తాడు మురళి.

"థర్డ్ క్లాసులో పాసవ్వడమూ పాసవ్వడమేనా? నాకు ఫస్ట్ క్లాస్ రావాలి!" అరిచినట్టే అన్నాడు.

ఒక్కోసారి ఎవరిమీదనో చూపించవలసిన కోపం ఆ సమయానికి ఎదురుగా ఉన్న వాళ్ళమీద చూపిస్తుంటారు. మురళీ కూడా తనకు జరిగిన అన్యాయాన్ని తలుచుకుని కుమిలిపోతూ ఎక్కడో కోపం చూపించలేని తన అసమర్థతను కప్పి పుచ్చుకుందుకు అమ్మా నాన్నలమీద అరవ సాగాడు.

అర్థం చేసుకోగలవాడు కాబట్టి రాజేశ్వరీ, రామారావూ మృదువుగా ఊరడించసాగారు నానీని. వాళ్ళకూ బాధగానే ఉన్నా ప్రస్తుతం ఆ కుర్రవాణ్ణి ఊరడించడం ముఖ్యమిపుడు.

కాస్సేపటికి తేరుకున్నాడు మురళీ.

రామారావు స్నానం కానిచ్చి, కొడుకును బలవంతంగా పంపాడు స్నానానికి.

టవల్ అరవేసి, రాజేశ్వరితో ఏదో మాట చెబుదామని వంటింట్లోకి వెళ్ళే సరికి పెరట్లోంచి నూతిలో ఏదో పడ్డట్టు పెద్ద శబ్దమైంది.

రామారావ్ పై ప్రాణాలు పైనే ఎగిరి

# ఓ మనసా, నే నెవరో నీకు తెలుసా?

ఒకప్పుడు -

నీలాకాశంలో విహరించే స్వేచ్ఛా పతంగాన్ని నేను
పర్వతశృంగంలో పరవశించి ప్రవహించే పావని గంగని నేను
తారా ఉదయాల్లో తాపస వర్షాల్లో వెలిగే తారాజువ్వని నేను
రాగ రంజిత రాధ మనసుల్లో రస రవళిని నేను
పిల్లనగ్రోవి పల్లవికి ప్రణమిల్లే పడతి కాలి మువ్వని నేను
జంటలు జంటి తేనె లందించే సొగసుల పెదవుల పులకింతను నేను
విరహిణి వియోగంలో పడి పడిగా వదిలే వెచ్చని నిట్టూర్పుని నేను
పాలు గారే పసిపాపల కౌగిలి బిగిలో పరవశించిపోయే తల్లిని నేను
వానల ఉప్పెనలో వాగుల వరదల్లో విరిసే కవి హృదయాన్ని నేను

మరి ఇప్పుడు

ఆకలి పోరాటంలో అర్రులు చాచి అలసిపోయిన అభాగిని నేను
అంధకారపు టకాంతిలో అలమటించే అజ్ఞానపు బంధువు నేను
జలజంత్రపు జల్లెడలో జల్లించిన జలధారను నేను
నింగి నీడలో నిశిరాత్రిలో నిద్ర రాక నిరసించిన నిరుపయోగపు వెన్నెలని నేను

అయినా -

కాలపు కబంధ హస్తాలలో కరగని కవితావేశాన్ని నేను
ఓ మనసా! నేనే నువ్వు, నువ్వే నేను—నేను నేనుగా నాదై మిగిలిన నువ్వు నువ్వే.

-వసుంధరా వనాదు

పోయాయి. గబగబా గుమ్మంలోకి వెళ్ళి చూశాడు. అంతవరకూ నీళ్ళు తోడుకుంటున్న మురళీ నూతి దగ్గర కనిపించలేదు.

"నానీ!" అని పెద్దగా కేకవేస్తూ నూతి వళ్ళెం వద్దకు పరుగెత్తి నూతిలోకి చూశాడు.

రాజేశ్వరి కేమీ అర్థం కాలేదు భర్త ఎందుకు అరిచాడో. అక్కడ నూతిలోకి చూచిన రామారావ్ "హమ్మయ్య!" అని నిట్టూర్చడం కనిపించింది.

"ఏమిటి, నాన్నా?" అని మురళీ బాత్ రూమ్‌లోంచి అడుగుతున్నాడు. రామారావు అటు చూశాడు. మురళి బాత్‌రూమ్‌లో ఉన్నట్టు టవల్ తలుపుమీద ఉంది.

"ఏం లేదులే. నువ్వు స్నానంచేసిరా" అని ఇవతలికి వచ్చాడు. రామారావు దీర్ఘంగా శ్వాస పీలుస్తున్నాడు. వాడు నూతిదగ్గర లేకపోవడంతో నూతిలో దూకేశా డనుకున్నాడు. కాదు, పక్కనే ఉన్న చెట్టుపైనుంచి పెద్ద కొబ్బరికాయ ఒకటి తెగి నూతిలో పడడంతో అయిన శబ్ద మది.

ఇది అప్పుడప్పుడూ జరిగేదే అయినా ఈ రోజెందుకో తనంత కంగారుపడ్డాడు.

లోపలికి వస్తున్న భర్త వంక వింతగా చూసింది రాజేశ్వరి.

రామారావు పట్టించుకోలేదు. సైకిలు గోడ పక్కగా జరిపి వరండాలో పడక కుర్చీ వేసుకుని, దినపత్రిక అందుకుని కూర్చున్నాడు. కాఫీ గ్లాసుతో వచ్చింది రాజేశ్వరి.

వేడిగా కాఫీ గొంతు దిగుతూంటే తల భారం తగ్గి ఆహ్లాదంగా ఉంది.

హటాత్తుగా గుర్తు వచ్చి అడిగాడు రామారావు—"బేబీ ఏది, రాజీ?" అని.

"ఏమోనండి. చాలాసేపటినుంచీ కనిపించ లేదు." రాజేశ్వరి.

"చాలాసేపటినుంచీనా?" రెట్టించాడు.

"ఆ. అన్నట్టు మరిచిపోయాను—ప్రేమగారి ఇంటికి వెళతానని వెళ్ళిందండోయ్."

"ఎప్పుడు?" కాస్త రిలీఫ్‌గా అన్నాడు ప్రేమగారి ఇంటికి అనగానే.

"రెండో మూడో అవుతుంది అప్పుడు."

"అరె! ఐదవుతోంది. ఇంకా రాలేదు."

"వస్తుంది లెండి! ప్రేమగారు కూర్చో బెట్టేసి ఉంటారు."

ఇంతలో మురళీ స్నానం ముగించుకుని వచ్చాడు. అది చూచి రామారావు పిలిచాడు. పైజామా, బనియను వేసుకుని తల దువ్వుకుని వచ్చి కూర్చున్నాడు తండ్రి ఎదురుగా, ఒకకుర్చీ వేసుకుని. రామారావు స్నేహితుడులా కొడుక్కి హితబోధ చెయ్యసాగాడు.

ఆ రోజంతా అతన్ని పీడించిన భయాలు అతని చేత ఒక చిన్న ఉపన్యాసం ఇచ్చేలా చేశాయి. అతని దృష్టిలో ఆత్మహత్యను మించిన నేరం లేదు. అది పిరికివాళ్ళు చేసే పని. జీవిత లక్ష్యాలను సాధించేందుకు విద్య ఒక అరత మాత్రమే. పరీక్షలో పాసు కాలేకపోయినంత మాత్రానో లేక మరేదో చిన్న కారణం చేతనో ఆత్మహత్యలకు పాల్పడడం అర్థం లేనిపని. నిజానికి అందరూ తెలివి గల వాళ్ళే ఉండరు, అలా అని లోకంలో తెలివి అంతా ఏ ఒక్కడి సొత్తూ కాదు. తలిచిందే జరిగితే దైవం ఎందుకని, అనుకున్న దానికి వ్యతిరేకంగా ఒకసారి పాసు కాలేకపోయినంత మాత్రాన మూర్ఖంగా ప్రాణాలు తీసుకోవడమేనా? ధైర్యంగా కృషి చేసి మం'కసారి పాసు కావచ్చునే? పరీక్ష అంటే దయ్యాల్లా భావించే తత్వం నుండి బయట పడాలి. ఇంత చదువుకున్నాక జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలే తప్ప పిరికిగా తల వంచకూడదు.

అయినా ఇటువంటి ఆత్మస్థైర్యాన్ని నేర్పలేని ప్రస్తుత విద్యావిధానాన్ని వేలెత్తి చూపక తప్పదు. చదువుకోవడం మాత్రమే కాదు, పిల్లలకు జీవించడం ఎలాగో నేర్పాలి పాటశాలలు.

కొడుక్కి అలా నాలుగు మంచి మాటలు చెబుతూండగానే చండీప్రియ హుషారుగా తిరిగి వచ్చింది. అప్పటికే చీకట్లు మెల్లగా అలుముకుంటున్నాయి.

"ఎక్కడికి కెళ్ళావమ్మా? చీకటి పడిపోలేదూ?" రామారావు దగ్గరికి తీసుకున్నాడు కూతుర్ని, ముంగురులు సవరిస్తూ.

"రైలు క్రింద ఎవరో అబ్బాయి పడి చచ్చి పోయాడు, నాన్నా! చూడ్డానికి వెళ్ళాను."

నోట మాట లేదు రామారావుకు.

"సరిగ్గా తలకాయ పూడిపోయింది, నాన్నా, కోడి లాగ!" ఉత్సాహంగా తాను చేసిన ఘనకార్యం. చెబుతూంది చండీప్రియ.

రామారావుకు ఏమనాలో తోచక భార్యనుపిలిచాడు.

విషయం తెలుసుక్ను రాజేశ్వరి ముందు ఆశ్చర్య పోయి, తరవాత కూతుర్ని మందలించింది. పెద్దవాళ్ళే చూడలేకపోతారే, అటువంటి దారుణదృశ్యాన్ని పసిపిల్ల చూడ్డానికి వెళ్ళడమా? అందుకనే ఇవతలికి లాగి, "ఎందు కెళ్ళావలా?" అని తీక్షణంగా ప్రశ్నించింది రెక్కలు పుచ్చుకుని.

అలవాటుగాతల్లిని ఎదిరించబోయిన చండీప్రియను రామారావుకూడా చాలా తీవ్రంగా కేకలు వేసి కొట్టేంత పని చేశాడు.

బిత్తరపోయింది చండీప్రియ.

ఏ నాడూ తల్లీ, తండ్రీ అంత ఇదిగా కేకలు

"వరుడు కావలయును"

హిందువు, తెల్లగ, సన్నగ, 5 అడుగుల ఎత్తు నెలకు 800 రూ॥లు జీతము. ఉద్యోగస్తురాలై నటువంటి యువతికి ఉద్యోగస్తుడు లేక వ్యాపారస్తుడు. 26 సం॥ల పైబడిన యువకుడు కావలయును. కులము పట్టింపులేదు. ఏ ప్రాంతము వారినుండి అయినను పూర్తి వివరములతో బాక్సు నెం. 187, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, దోమలగుడ, హైద్రాబాదు–29కు వ్రాయండి.

డా॥ పి.వి.కె.రావ్, B.A.



సెక్స్ స్పెషలిస్ట్
(వైద్య విద్వాన్ - వైద్యాచార్య)
వివాహము చూడాలంటే వేయ నవసరము లేదు. మరల్పాప ములవలన కలిగిన నరముల బలహీనత, సుఖవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు ...

రావూస్ క్లినిక్,
టి.బి.రోడ్, తెనాలి. ఫోన్: 700.




పరీక్షద్వారా ప్రశస్తమైనది
నాథ్ పీటర్స్
సైదాబాద్, హైదరాబాద్–500 659.

స్వయం ఉపాధి

ఫోటోగ్రఫీ మరియు స్క్రీన్ ప్రింటింగ్, పనులను పోస్టు ద్వారా నేర్చుకొని సులభముగా పనిచేసి సంపాదించ వచ్చును. అన్ని రహస్యములు ఇంగ్లీషు, హిందీ మరియు తమిళ భాషలలో నేర్పబడును. ప్రాస్పెక్టసు కొరకు వ్రాయండి.

KALAI MATHI NILAYAM (A)
Nanjai Thalaiyur - 639 204
TAMILNADU

శతృభయమా? బలంగా, ధైర్యంగా, స్త్రీ పురుషులు ఆత్మరక్షణకు, ఎదుర్కోటానికి ఇంటి దగ్గరే నేర్చుకోడానికి వీలుగా బొమ్మలతో వివరించబడిన అంబడి పూడి పుస్తకాలు. (1) కరాటే (2) చీనా కరాటే (3) జూడో (4) కుంగ్ ఫూ (5) ఫైటింగ్ (6) యోగ (7) సవాల్ (8) బ్రూస్లీ పూర్తి జీవిత రహస్యం (9) మహమ్మదాలీ.
30 రూపాయలు పంపిన వారికి రిజిష్టర్డు పోస్టులో పంపబడును. వి. పి. పద్ధతి లేదు.
జలజ ప్రచురణలు, విజయవాడ–3.

వేయలేదు. మొండిగా వాదనకు దిగింది అందుకే.

'ఏమేవ్! మరీ మీరిపోతున్నావ్. తప్పు, వూరుకో.' అమ్మా నాన్నలతో చెల్లెలు వేసుకుంటున్న వాదం చూస్తూ వూరుకోలేక మురళీ అన్నాడు.

అంతవరకూ ఎంతో ఉద్రేకంగా దెబ్బలాడు తున్న చండీప్రియ మురళి అలా అనేసరికి అందరి వంకా ఒక్కసారి తీక్షణంగా చూసింది. వెంటనే "అవున్లే. మీ రంతా ఒక్కటే. నేనెందుకు మీకు?" అంటూ విసురుగా వెళ్ళి ఒక మూల కూర్చుని ఏడుపు మొదలు పెట్టింది.

అవాక్కయి పోయారు ముగ్గురూ.

మళ్ళీ పంతం పట్టింది! అయితే ఎప్పటిలా వెంటనే వెళ్ళి రామారావు కాని, రాజేశ్వరి కాని బ్రతిమ లాడలేదు. అలా బ్రతిమలాడుతారని ఆశించిన చండీప్రియకు షాక్ తగిలినట్టయి అలానే ముసుగ దీసుకుపోయి కూర్చుని శూన్యంలోకి చూస్తూ కన్నీళ్ళు కార్చసాగింది వెక్కుతూ.

ఏడయింది.

అందరి భోజనాలూ అయిపోయాయి కాని,ఎంత పిలిచినా, బతిమలాడినా చండీప్రియ మాత్రం లేవలేదు. తండ్రి చెప్పినా లేదు, తల్లి చెప్పినా లేదు. కోపంలో నిజానికి ఎక్కువ బ్రతిమలాడలేదు ఎవ్వరూ. "మీరు తినేశారుగా? అవతలికి పొండి. మీకు నే నెందుకు?" అంటూ అరవసాగింది ఎవరు వెళ్ళి భోజనం చెయ్యమన్నా.

చేసేదిలేక పదింటి వరకూ చూచి పళ్ళెంలో భోజనం, గ్లాసుతో మంచినీళ్ళు మూత వేసి టేబుల్ పైన పెట్టి, రాజేశ్వరి లైట్ ఆఫ్ చేసి పడుకుంది. అంతగా ఆక లైతే అదే తింటుంది లెమ్మని.

పాల వాన్ హారనుకు ఉలిక్కి పడి లేచింది రాజేశ్వరి. తెలతెల వారుతూంది.

ఎదురుగా మందిరంలో ఉన్న వేంకటేశ్వరునికి నమస్కరించి కుంకుమ దిద్దుకుంది.

రాత్రి చండీప్రియ భోజనం చెయ్యలేదని గుర్తు వచ్చి ముందు గదిలోకి వెళ్ళి చూసింది. చండీప్రియ ప్రశాంతంగా మంచం మీద నిదుర బోతూంది. టేబుల్ మీద కంచం ఖాళీగా ఉండడం చూసి నవ్వుకుంది.

వరండాలోకి వెళ్ళి మురళిని లేపితే పాల పాకెట్లు తెచ్చి మళ్ళీ ముసుగు తన్నాడు.

రామారావు లేచేసరికి రాజేశ్వరి వంటింట్లో కాఫీ మహా యజ్ఞం చేస్తూంది.

"కాఫీయ్!" రైల్లో అరిచినట్టు బెడ్ కాఫీ కోసం అరిచాడు, లేస్తూనే.

"వస్తున్నా" అంటూ రాజేశ్వరి క్షణంలో కాఫీ గ్లాసుతో ప్రత్యక్షమైంది. కాఫీ అందించి లోనికి వెళ్ళి పోబోతున్న భార్యను గుర్తు వచ్చి అడిగాడు— "బేబీ భోజనం కానీ చేసిందా?" అని.

నవ్వుతూ బదు లిచ్చింది రాజేశ్వరి—"ఆ ఇంకా లేవలేదు. ఎన్నింటి వరకూ ఏడిచిందో మరి!"

ఇద్దరికీ తృప్తిగా ఉంది, కూతురు అనవసరంగా కడుపు మాడ్చుకోలేదని.

కాఫీ పూర్తి అయింది. రోజూ ఆసరికే లేచి ఇల్లంతా కలియ దిరుగుతూ ఉండే కూతురు ఇంకా లేవకపోవడంతో వెలితిగా ఉండి రామారావ్ లేపేందుకు వెళ్ళాడు.

ప్రశాంతంగా నిదురబోతూ ఉంది.

"బేబీ! బేబీ! లే అమ్మా! ఏడయింది!" లాలనగా పిలిచాడు. నిన్న అనవసరంగా కేకలు వేసి బాధ పెట్టానేమో పిచ్చి పిల్లను అని మథన పడసాగాడు—వాడి చారికలు కట్టిన చంద్రబింబం లాటి చండీప్రియ ముఖాన్ని చూస్తూ.

ఎంత పిలిచినా లేవకపోవడంతో "అడ్డెడ్డే!" అంటూ చక్కిలిగింతలు పెట్టాడు.

రామారావ్‌కు షాక్ కొట్టినట్టయింది. ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు.

చండీప్రియ శరీరం చల్లగా, మంచు గడ్డలా బిగుసుకు పోయి ఉంది.

"బేబీ, బేబీ!" కంగారుతో వణుకుతూ పిలిచాడు.

రాజేశ్వరి పరిగెత్తుకు వచ్చింది.

ఇంకెక్కడి బేబీ? ఆమె ప్రాణం పోయి చాలా సేపయింది.

"ఇదేమిటే, బేబీ చచ్చిపోయింది!" బావురు మన్నాడు రామారావు.

"బేబీ!" ఘోల్లున కుప్ప కూలిపోయింది రాజేశ్వరి, బేబీ శవాన్ని కౌగిలించుకుంటూ. పేగులు తెగే ఆర్త నాద మది. కన్న తల్లికి మాత్రమే తెలుసు ఆ కడుపు కోత. అదాటుతో నిద్ర లేచిన మురళి కంతా అయోమయంగా ఉంది. చెల్లెలి కాళ్ళ దగ్గర మూగగా రోదించ సాగాడు.

"బేబీ! లే అమ్మా. ఏమైందే నీకు?" భోరున ఏడుస్తూ కుదిపి వేస్తూంది చండీప్రియను రాజేశ్వరి.

ఆ తల్లి ఆరాటం చూడశక్యంగాకుండా ఉంది. ముక్కు మీద వేలుంచుతూ "ఏమండీ! చూడండి. ఏ డాక్టర్నయినా పిలవండి. బతుకుతుందేమో" అంటూ రోదిస్తూంది హృదయ విదారకంగా.

లేదన్నట్టు తల అడ్డంగా వూపాడు రామారావు, భార్యను వూరడిస్తూ..

ఏడుపులు విని చుట్టు పక్కల వారు పోగవ్వ సాగారు ఏమి టేమిటంటూ.

"ఇంకెవరికోసమమ్మా మా జీవితం!" చండీప్రియ ముద్దు ముఖాన్ని చుంబిస్తూ రాజేశ్వరి గోడు.

రామారావు దృష్టి తలగడ కింద కనిపిస్తున్న కాగితంపై పడింది. అనుమానతో వణుకుతూ విప్పాడు.

కళ్ళ నీళ్ళకు అక్షరాలు అలుముకు పోతున్నాయి. అది చండీప్రియ వ్రాతే.

"నేను చనిపోవుటకు ఎవరూ కారణము కాదు. నేనే జీవితముపై విరక్తితో చనిపోవుచున్నాను. రైలు కింద పడిన నెప్పిగా ఉండునని నాన్న తెచ్చిన ఎలుకల మందు తిని చనిపోవుచున్నాను.

అందరకూ నమస్కారములు. నా శవాన్ని ఎక్కువ సేపు ఉంచవద్దు."

"బేబీ!" గిజగిజ లాడి పోతున్నాడు రామారావ్. అతనికి ఈటూలున విన్న రైలు కింద పడి చని పోయిన అబ్బాయి ఉత్తరం గుర్తు వచ్చింది. విరక్తి! ఎంత పెద్దపదం! ఈ చిన్నారులకు దాని అర్థం తెలుసా అసలు?

"అయ్యో! చేజేతులా ఎలకల మందు తెప్పించి నిన్ను చంపుకున్నానే!" అంటూ తల బాదు కుంటూంది రాజేశ్వరి. పన్నెండేళ్ళకే కూతురుకి నూరేళ్ళునిండాయంటే నమ్మలేకుండా ఉంది.

వచ్చిన వాళ్ళు శవాన్ని మంచం దించమంటూ హడావుడి చేస్తున్నారు. ★

---

# నీవు-నేను

**-వసంతరావు దేశపాండే**

## ప్రతి రోజూ

నా వూహల్లో
నీ కాపరం
అనంతమైన ఆకాశం పందిరి కింద
ఆకుపచ్చ మైదానాల్లో
నీ వెనక నేను
నా వెనక నీవు
ఆనందాల వూటకేసి మన పరుగు
మన తోవలో
పరువంతో పరుగులు తీసే
రంగు రంగుల పూలు
కాళ్ళకింద మేలి ముత్యాల గిలిగింతలు
మనల్ని కలిపేస్తూ జారుతున్న మంచు తెరలు
నీవే నేనై
నేనే నీవై
చేతులు శ్రుతిగా
వూపిరి లయగా
కలిసి పలుకుతుంది
ఆనంద గీతం మవునంగా
తడిసిన నీ పెదవుల్లో
మూసుకున్న కనురెప్పల్లో
ఎవరికీ దొరకని భావం

ఏ కుంచె కొస కందని లావణ్యం
నాకు అందుతుంది
భావం
భాష
స్పర్శ
అన్నీ చచ్చిపోతాయి
అన్నిటికీ
అతీతమైన సమాధిలో కేవలం
నీవు — నేను
నేను — నీవు
ఇంకేమీ లేదు
ఇంకెవరూ లేరు
ఆ సుషుప్తిలోంచి మేల్కొని
కళ్ళు తెరిస్తే
కనిపించేది
నువ్వు ... ... ... కవిత